నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 26 డిసెంబర్ 2023 | NAGARKURNOOL

## కూచిపూడిలో నల్లమల విద్యార్థిని ప్రతిభ

- గిన్నిస్ రికార్డులో చోటు సంపాదించిన శ్రేష్ఠ

కపిలవాయి శ్రేష్ఠ

అచ్చంపేటరూరల్, డిసెంబర్ 25 : తెలుగు వారి ప్రాచీన నృత్యం కూచిపూడిలో నల్లమల విద్యార్థిని కపిలవాయి శ్రేష్ఠ ఉత్తమ ప్రతిభను కనబర్చడంతోపాటు గిన్నిస్ రికార్డు నెలకొల్పారని తల్లిదండ్రులు ప్రవళిక, రామ్మోహన్ తెలిపారు. ఆదివారం రాత్రి గచ్చిబౌలి అథ్లెటిక్ స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి కళా వైభవం పేరిట లార్జెస్ట్ డ్యాన్స్ లెసన్ ప్రదర్శించారు. అచ్చంపేట పట్టణానికి చెందిన శ్రేష్ఠతో పాటు 3,783 మంది విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేసి ప్రపంచానికి చాటారు. అందులో భాగస్వామ్యమైనందుకు శ్రేష్ఠను తల్లిదండ్రులు, గ్రామస్తులు చంద్రమోహన్, ముత్యాలాచారి, విశ్వేశ్వరాచారి, రాఘవాచారి, శ్రీనివాసాచారి, బ్రహ్మచారి, జంగాచారి, వెంకటాచారి, తరుణ్, సాయి తదితరులు అభినందించారు.

ఉమ్మడి జిల్లాలో సోమవారం క్రిస్మస్ శోభ సంతరించుకున్నది. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. లోక రక్షకుడికి జేజేలు పలికారు. క్రిస్మస్ ట్రీ, స్టార్స్‌తో అలంకరించారు. శాంటాక్లాజ్ వేషధారణలు ఆకట్టుకోగా.. కేక్ కట్ చేసి పంచుకున్నారు. భక్తిగీతాలు ఆలపించారు.

అమరచింత చీరలకు

# జాతీయ ఖ్యాతి

- హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఇతర నగరాలకు ఎగుమతి
- మూడేండ్లుగా ఎంఎస్ఎంఈ సెంటర్ నిర్వహణ
- 45 మగ్గాల ద్వారా చీరల తయారీ
- ఇండ్ల వద్ద మరో 37 మగ్గాలతో నిత్యం నేత పనులు
- నెలకు 120కిపైగా చీరలు సిద్ధం
- ఉపాధి పొందుతున్న 250మంది
- అన్ని కులాల వారికి ఉచిత శిక్షణ
- కేసీఆర్ సర్కారుతోనే జవసత్వాలు

వనపర్తి, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : చేనేత రంగానికి మంచిరోజులు వచ్చాయి. గత కేసీఆర్ ప్రభుత్వం చేనేతకు చేయూతనివ్వడంతో ఈ రంగం పురోగాభివృద్ధిలో పయనిస్తున్నది. మగ్గాల మీద చీరలు, బట్టలు నేసి పలు కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో చేనేతకు పెట్టింది పేరుగా.. కొత్తకోట, గద్వాల, రాజోళి, నారాయణపేటతోపాటు అమరచింత పేరొందాయి. ఉమ్మడి రాష్ట్ర పాలనలో మగ్గం ఆడక ఎన్నో కుటుంబాలకు జీవనోపాధి కరువైంది. కానీ తర్వాత 2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వారికి వెన్నంటే నిలిచింది. దీంతో వందలాది నేతన్నల కుటుంబాలు జీవనోపాధి పొందడంతో చేనేతకు మళ్లీ జవసత్వాలు వచ్చాయి.

### అమరచింతకుగుర్తింపు

వనపర్తి జిల్లా అమరచింత మరో అడుగు ముందుకేసింది. ఇక్కడ తయారయ్యే చీరలను దేశంలోని పెద్ద నగరాలు, పట్టణాలకు ఎగుమతి అవుతున్నాయి. కొత్తగా నేత పని నేర్చుకోవాలనుకునే వారికి సైతం ఉచితంగా శిక్షణనిస్తూ అండగా నిలుస్తున్నారు. 2019లో ఎంఎస్ఎంఈ (మినిస్ట్రీ ఆఫ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజెస్) ఆధ్వర్యంలో అమరచింత సిల్క్ హ్యాండ్‌లూం క్లస్టర్ పరిధిలో కామన్ ఫెసిలిటీ సెంటర్ గత మూడేళ్లుగా కొనసాగుతున్నది. సెంటర్‌లో ఒకేచోట 45 మగ్గాలను ఏర్పాటు చేశారు. వీటితోపాటు ఇండ్ల వద్ద మరో 37 మగ్గాలు వీరి పరిధిలోనే నడుస్తున్నాయి. ఇలా మొత్తం దాదాపు 250 మంది కార్మికులు ఇక్కడ పని చేస్తూ చీరలను తయారు చేస్తున్నారు. గతంలోనూ ఇండ్ల వద్ద మగ్గాలను ఏర్పాటు చేసుకునే కార్మికులు, ఇప్పుడు నేరుగా సెంటర్‌కు వచ్చి పనులు చేసుకుంటున్నారు. అద్దె ఇండ్లు, చిన్నపాటి ఇళ్లు, గుడిసెలాంటివి ఉన్న నిరుపేదలు మగ్గాలను ఏర్పాటు చేసుకుని నేయడం కష్టం. అలాంటి వారందరికీ ఈ సెంటర్ ఎంతో ఉపయోగపడుతున్నది. అందుకే గతంలోనూ అమరచింత చేనేత మంచి పేరు తెచ్చుకున్నది. ఈ సెంటర్ అనేక కుటుంబాలకు ఉపాధిని ఇవ్వడమే కాకుండా కొత్తగా నేత పని నేర్చుకునే వారికి సైతం ఉచితంగా శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఈ సెంటర్ అంచెలంచెలుగా ఎదుగుతూ చేనేతరంగానికి ఊతమిస్తున్నది.

### నెలకు 120 చీరల ఉత్పత్తి

45 మగ్గాల ద్వారా ప్రతినెలా దాదాపు 120 చీరలను నేతన్నలు తయారు చేస్తున్నారు. చీరల డిజైన్ల మేరకు ఒక్కో నెలలో చీరల ఉత్పత్తి అటు.. ఇటుగా ఉంటుంది. ఇక్కడ నేసిన చీరల ధరలు రూ.10 వేలు మొదలుకుని రూ.లక్ష వరకు ఒక్కో దాని ధర ఉంటుంది. వివాహాది శుభకార్యాలకు ఇక్కడి చీరలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ప్రతి రోజు 250 మంది వరకు కార్మికులు ఇక్కడ పని చేస్తారు. వీరిలో నేత పనిలో కొందరు ఉంటే, మరికొందరు ఇతర పనుల్లో సహాయకులుగా కొనసాగుతున్నారు. ఒక్క చీరను సిద్ధం చేయడానికి పది రోజుల సమయం తీసుకుంటున్నట్లు కార్మికులు చెబుతుండగా, ప్రతినెలలో ఒక మగ్గంపై కనీసం మూడు చీరలను సిద్ధం చేస్తారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సెంటర్‌లో నేత పనులు కొనసాగుతున్నాయి. అయితే ఈ పనులు చేసే కార్మికులు నెలకు ఒక్కొక్కరూ రూ.10 నుంచి రూ.15 వేల వరకు సంపాదిస్తున్నారు. ప్రతినెలా 5వ తేదీ వరకు బ్యాంక్ ఖాతాల్లో వేతనాలు పొందుతున్నారు.

### పక్క రాష్ట్రాలకుఎగు మతి

అమరచింతలో తయారైన చీరలు పక్క రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. ఆర్డర్‌పై హైదరాబాద్, బెంగళూరు, చెన్నైతోపాటు పలు నగరాలకు సరఫరా చేస్తున్నారు. వీటితోపాటు తెలంగాణలోని పలు జిల్లాలోని దుకాణాలు, షాపింగ్ మాల్స్‌లో ఇక్కడి చీరలే ఉంటున్నాయి. మున్సిపాలిటీలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి స్వయంగా విక్రయాలను చేపట్టడం విశేషం. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసే చేనేత సందర్శన కేంద్రాల్లోనూ ఇక్కడి చీరలను ప్రత్యేక స్టాల్స్ ద్వారా విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకునే వారికి సైతం ఆర్డర్స్ మేరకు పంపిస్తున్నారు. గడచిన మూడేండ్లుగా జరిగిన విక్రయాలను చూస్తే 2021-22లో రూ.80 లక్షలు, 2022-23లో రూ.కోటీ 20 లక్షలు, 2023-24లో రూ.కోటీ 10 లక్షలు (ఇప్పటి వరకు) చేపట్టారు. దీంతో అంచలంచెలుగా ఈ సెంటర్ ఎదుగుతూ వచ్చింది.

### నేత పనిలో..

వృత్తుల వారీగా చూస్తే.. చేనేతలో పద్మశాలీ కుటుంబాల వారు అధికంగా ఉంటారు. అయితే ఇప్పుడు చేనేతలో అందరూ కనిపిస్తున్నారు. ఆడ, మగ, కుల, మతాలకు తావులేకుండా ఉంటున్నారు. వాల్మీకులు, రజకులు, ముస్లింలు, పద్మశాలీ, ముదిరాజ్‌లు ఇలా అనేకంగా ఈ రంగంలో పనిచేస్తున్నారు. మధ్యలో కొన్ని ఆటుపోట్లను ఎదుర్కొన్న చేనేతరంగ కార్మికులు, ఈ మూడేళ్ల నుంచి ఈ ప్రాంతంలో సెంటర్ ద్వారా ఉపాధి పొందుతున్నారు. అమరచింతలో ఉండే కామన్ ఫెసిలిటీ సెంటర్‌లో అనేక మంది కొత్త వారు శిక్షణ తీసుకుంటున్నారు. శిక్షకులకు 45 రోజులపాటు ఉచిత భోజన వసతి కల్పించి నేత పని నేర్పిస్తున్నారు. ఈ శిక్షణ అనంతరం ఇదే కేంద్రంలో పని చేయడం... లేదా సొంతంగా ఇంటి దగ్గరైనా పని చేసుకునే వెసలుబాటు కల్పిస్తున్నారు. ప్రతి ఏటా ఆడిట్ జరిపించిన అనంతరం వచ్చిన లాభాల్లో 40 శాతం వాటాను కార్మికులకు చెల్లిస్తారు. ఇదిలా ఉంటే కేవలం పని వచ్చిన వారికే కాకుండా కొత్త వారికి సైతం నేత శిక్షణ ఇవ్వడం, అలాగే టైలరింగ్‌లోనూ ఉచితంగా శిక్షణ ఇవ్వడం కోసం ప్రత్యేకంగా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. చీరలతోపాటు పంజాబీ, షర్ట్స్, అయ్యప్ప దీక్ష వస్త్రాలను ఆయా కంపెనీలు ఆర్డర్స్ మేరకు ఇక్కడ తయారు చేస్తున్నారు. ఇందుకు మరో పది మిషన్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అలాగే కొత్త నేతను నేర్చుకునే వారి కోసం మరో పది మగ్గాలను సెంటర్‌లో ఉంచారు.

అమరచింతలో నేత పనిలో కార్మికుడు

### సేద్యం రాదు.. నేత పనే వచ్చు

నాకు చిన్ననాటి నుంచి సేద్యం పని రాదు.. నేత పని మాత్రమే వస్తది.. ప్రస్తుతం మా ఇళ్లు మరమ్మతు చేస్తున్నాం. ఇంట్లో నేయడం కుదరదు. ఈ సెంటర్ ఉండడంతో ఎంతో సౌకర్యంగా ఉంది. ప్రతి నెలా రెండు సాధారణ చీరలను నేను ఒక్కదానినే నేస్తాను. అదే ఇంటి దగ్గరైతే నాలుగు చీరలకు వరకు తయారు చేస్తాను. నా భర్త వ్యవసాయం పనులకు వెళ్తాడు. నేను ఖాళీగా ఇంటిపట్టున ఉండడం ఎందుకని వచ్చిన పని చేసుకుంటే బాగుంటుందని సెంటర్‌కు వస్తున్నాను.

**- బాలమణి, నేత కార్మికురాలు, అమరచింత**

### నెలకు మూడు చీరలు నేస్తాను

సెంటర్‌లో ప్రతి నెలా మూడు చీరలు నేస్తాను. ఒక్కో చీరకు రూ.4 వేల చొప్పున ఇస్తారు. నెలకు 12 వేలు వస్తాయి. ఇంట్లో కూడా మగ్గం ఉండే కానీ, ఇబ్బంది అయింది.. సెంటర్ ఏర్పాటైన నాటి నుంచి ఇక్కడికే వస్తున్నాను.. ప్రారంభంలో షెడ్ పనులు జరిగినప్పుడు వాచ్‌మెన్‌గా పని చేశా. ఇప్పుడు సెంటర్ బాగా నడుస్తుంది. ఇబ్బంది అసలే లేదు.

**- తిమ్మలు, నేత కార్మికుడు, అమరచింత**

### 25 ఏండ్లుగా ఇదే పని

25 ఏండ్లుగా నేత పనిలోనే ఉన్నా. మధ్యలో పని లేనప్పుడు కొన్ని నెలలు కట్టె కోత మిషన్‌లో పని చేయగా.. చేతికి గాయమైంది. ఇప్పుడు సెంటర్‌లో పని బాగుంది. నెలకు మూడు నుంచి నాలుగు చీరలు నేస్తా. రూ.12 నుంచి రూ.15 వేల వరకు ఆదాయం వస్తుంది. చీరల డిజైన్ల మేరకు మాకు డబ్బులు వస్తాయి. నాతో పాటు నా భార్య కూడా ఇదే పని చేస్తుంది.

**- హుస్సేన్, నేత కార్మికుడు, అమరచింత**

## కనుల పండువగా కల్యాణం

- వెంకటన్నస్వామికి పట్టువస్త్రాలు సమర్పించినఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిదం పతులు
- ఆదిశిలాక్షేత్రానికిఅ శేషంగా తరలివచ్చినజ నవాహిని

స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే

మల్దకల్, డిసెంబర్ 25 : మల్దకల్‌లోని ఆదిశిలా క్షేత్రంలో ఆదివారం అర్ధరాత్రి భక్తుల గోవింద నామస్మరణ మధ్య శ్రీలక్ష్మీ, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. వేదపండితులు ప్రసన్నాచారి, ప్రమోదాచారి, మధుసూదనాచార్యులు, రవిచారి, శ్రీధర్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణలతో అశేషంగా తరలివచ్చిన భక్తజనుల మధ్యస్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి ముందు స్వామి వారిని గజవాహనంపై గ్రామంలోని దశమి కట్ట వరకు ఊరేగించి అక్కడ స్వామివారి లగ్నపత్రికను ప్రజలకు చదివి వినిపించి ప్రతిఒక్కరూ వివాహానికి హాజరుకావాలని ఆహ్వానం పలికారు. అనంతరం వేదికపైన కనుల పండువగా స్వామివారి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు హాజరై పట్టు వస్త్రాలను సమర్పించారు. ఎమ్మెల్యేను చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా ప్రత్యేక పూజలు, కల్యాణోత్సవం అనంతరం స్వామివారి శేషవస్త్రంతో ఎమ్మెల్యేను సన్మానించి తీర్థప్రసాదాలు పంపిణీ చేసి ఆశీస్సులు అందజేశారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు తెలంగాణ జిల్లాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేయగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై కల్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు రాజారెడ్డి, విజయ్‌కుమార్, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తిమ్మారెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డితోపాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్‌లోని ఆదిశిలా క్షేత్రంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

## స్వామియే శరణమయ్యప్ప

- మార్మోగిన అయ్యప్ప నామస్మరణ
- పాలమూరులో మహాపడి పూజ
- పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

అయ్యప్పస్వామి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

పాలమూరు, డిసెంబర్ 25 : పాలమూరు అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. సోమవారం జిల్లా కేంద్రంలోని అయ్యప్పకొండపై ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరంలో స్వాములు రక్తదానం చేశారు. అలాగే తూర్పు కమాన్ నుంచి అయ్యప్ప కొండ వరకు స్వామి పల్లకీ శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. స్వామియే శరణమయ్యప్ప అంటూ స్వాములు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. భక్తిగీతాలు, భజనలు, నృత్యాలు చేస్తూ స్వామిని కొలిచారు. శోభాయాత్ర ఆద్యంతం వైభవంగా సాగింది. ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్ పాల్గొని పూజలు చేశారు. రాత్రికి వెంకటేశ్వర చంద్రమౌళిశర్మ గురుస్వామి ఆధ్వర్యంలో మహాపడిపూజ కనులపండువగా జరిగింది. వేలాదిగా అయ్యప్పస్వాములు పాల్గొన్నారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షుడు భగవంతాచారి, రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, గురుస్వాములు అన్వేశ్, మా లాద్రి, సంతోశ్, స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌లో అయ్యప్ప శోభాయాత్రలో స్వాములు

## ధ్యానసాధనతో మానసిక ప్రశాంతత

- ప్రముఖ నటుడు, గేయ రచయిత తనికెళ్ల భరణి
- పత్రీజీ ధ్యాన మహాయాగంలో పాల్గొన్న ధ్యానగురువులు
- పిరమిడ్‌ఆ వరణలో ఘనంగా క్రిస్మస్‌వేడు కలు

కడ్తాల్ ధ్యాన సభలో మాట్లాడుతున్న తనికెళ్ల భరణి, అలరించిన సాంస్కృతిక ప్రదర్శన

కడ్తాల్, డిసెంబర్ 25 : మానవాళికి ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ చేసిన మహోపకారమే 'శ్వాస మీద ధ్యాస' అని, నిత్యం ధ్యాన సాధనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రముఖ నటుడు, గేయ రచయిత తనికెళ్ల భరణి అన్నారు. కడ్తాల్ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్‌లో పిరమిడ్ స్పిరిచ్‌వల్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న సుభాష్‌పత్రీజీ ధ్యాన మహాయాగం-2 ఐదో రోజుకి చేరుకున్నది. సోమవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా మహాయాగానికి ధ్యాను లు అధికసంఖ్యలో హాజరయ్యారు. ఉదయం 5నుంచి 8గంటల వరకు నిర్వహించిన ప్రాతఃకాల ధ్యానంలో, వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ఆధ్యాత్మిక గురువులు, పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పత్రీ ది ఇండియన్ పిరమిడ్ స్పిరిచ్‌వల్ సొసైటీస్ మూవ్‌మెంట్ వ్యవస్థాపక సభ్యురాలు స్వర్ణమాల పత్రీ, క్రైస్తవ మత ప్రచారకుడు అనిల్‌కుమార్‌తో కలిసి తనికెళ్ల భరణి మాట్లాడుతూ ధ్యానానికి కుల, మత భేదం లేదని, ప్రతిఒక్కరూ ధ్యాన సాధన చేయవచ్చని చెప్పారు. 30 ఏండ్ల కిందట పత్రీజీ నాటిన ధ్యాన విత్తనం ప్రస్తు తం ప్రపంచవ్యాప్తంగా వట వృక్షంవలే విస్తరించిందని పేర్కొన్నారు. అనంతరం ఆయన 'నాలోన శివుడు గలడు' అనే పాటను ఆలపించి ధ్యా నుల్ని రంజింపజేశారు. పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రీ మాట్లాడుతూ మనలోని సంకల్పానికి ధ్యానం తోడైతే అద్భుతాలు సృష్టించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పిరమిడ్ సభా వేదికపై క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం పిరమిడ్ ప్రధాన వేదికపై జానపద పాటలు, కళాకారుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పత్రీజీ కు మార్తె పరిణీతపత్రీ, ట్రస్ట్ సభ్యులు బాలకృష్ణ, సాంబశివరావు, శ్రీరాంగోపాల్, రాంబాబు, హన్మంతురా జు, శివప్రసాద్, దామోదర్‌రెడ్డి, మాధవి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా..

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూరు, డిసెంబర్ 25: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందామని నిరాశకు గురికావొద్దని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీపీ బంగారు శ్రీనివాసులు స్వగృహంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ పార్టీ గెలుపునకు కృషి చేశారని, ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు తట్టుకొని నిలబడాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పదేండ్లుగా పార్టీకి పట్టుగొమ్మలుగా పనిచేసిన ప్రతిఒక్కరికీ తాను అండగా ఉంటానన్నారు. ఓటమి చెందినంత మాత్రాన అంతా అయిపోయిందని అనుకోకూడదని, రానున్న రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలు రానున్నాయని, వాటిలో పార్టీ విజయానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆత్మకూరు అభివృద్ధికి ఇచ్చిన హామీలను నెరవేర్చుకునేందుకు అధికార పార్టీపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, పీఏసీసీఎస్ అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవికుమార్ యాదవ్, ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు అమలు చేయాలి

- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

అచ్చంపేటటౌన్, డిసెంబర్ 25 : ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు కోరారు. దాడులే మీ లక్ష్యమైతే.. కాలమే సమాధానం చెబుతుందని కాంగ్రెస్ దాడులను ఉద్దేశించి పేర్కొన్నారు. సోమవారం అచ్చంపేటలోని తన నివాసంలో పార్టీ కార్యకర్తలు, విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 రోజుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం వివిధ అంశాలను ప్రస్తావిస్తూనే ఇ చ్చిన హామీలను నెరవేర్చే విషయంలో స్పష్టత ఇవ్వకుండా దాటవేసే ధోరణి అవలంభిస్తుందని ఆరోపించారు. కేసీఆర్ సర్కారు తీరును విమర్శించడమే కాదు చేసిన మంచి పనులను కూడా ప్రజలకు చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆటోడ్రైవర్లకు సమస్యలు తలెత్తుతున్నాయని, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో ఆశతో ప్రభుత్వానికి సహకరించారని, వారి డిమాండ్లు నెరవేర్చాల్సిన అవసరం ఉం దన్నారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకు లు, కార్యకర్తలు అండగా ఉన్నటువంటి వారు ధైర్యా న్ని కోల్పోవద్దని, తెలంగాణ ఉద్యమంలో ఏవిధంగా అయితే పోరాటాన్ని సాగించామో అదేపంథాలో రాష్ట్ర ప్రజల బాగోగుల కోసం పాటు పడదామని పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో ఎన్నో సార్లు తనను ఇక్కడి నుంచి తరుము తాం, బొంద పెడతామని మాట్లాడడం జరిగిందని, కానీ ఏరోజు వారిపై పగ తీర్చుకోవాలనుకోలేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే వంశీకృష్ణ తన అనుచర గణంతో నాపై దాడి చేసిం డు అందుకే ఆ కేసు విచారణలో ఉన్నది. ఆ విషయమై నేను ఒక ప్రసంగంలో రాజీపడితే తప్పా నా పర్మిషన్ లేకుండా ఎక్కడికి వెళ్లలేవు అనే మాటలను వక్రీకరిస్తున్నారన్నారు. మీరు ప్రవర్తించే తీరు ప్రజాస్వామ్యానికే కలంకం తెచ్చేలా ఉందని సరిచేసుకోవాలని హితవుపలికారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహాగౌడ్, తులసీరాం, అమీనొద్దీన్, శ్రీధతోపాటు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


నాగర్‌కర్నూల్‌లో ప్రధాన రహదారిపై కమ్ముకున్న పొగమంచు

నాగర్‌కర్నూల్‌లో..

జడ్చర్లలో..

## కమ్మేసిన పొగమంచు

ఉమ్మడి పాలమూరు జిల్లాను మంచు దుప్పటి కప్పేసింది. సోమవారం పలు ప్రాంతాలంతా పొగమంచుతో నిండిపోయాయి. ఉదయం 9 గంటల వరకు భానుడు సైతం మంచులో చిక్కుకున్నాడు. రోడ్లు కనిపించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వాహనాలన్నీ లైట్ల వెలుతురులో రాకపోకలు సాగించాయి. మంకరలో పల్లె, పట్నాలు సరికొత్త అందాలతో కనువిందు చేశాయి. ముగ్ధమనోహరంగా మారిపోయాయి. మరో మూడ్రోజులు చలి ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ సూచనలతో ప్రజలు, పిల్లలు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు చెబుతున్నారు.

– నాగర్‌కర్నూల్ (నమస్తే తెలంగాణ)/జడ్చర్ల, డిసెంబర్ 25